క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకం


అభిషేకాలు అందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. విశేష పూజలు జరిపి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


సినిమా హాలు కూడలిలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభించిన యువత

పరవాడ: స్థానిక సినిమాహాలు కూడలిలో పైడిమాంబ వెల్డింగ్ షాపు వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని స్థానిక యువత శుక్రవారం ఏర్పాటు చేశారు. వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా కూడలి మీదుగా రాకపోకలు సాగించేవారు దాహార్తిని తీర్చుకునేందుకు ఈ చలివేంద్రాన్ని వినియోగించుకోవాలన్నారు. చలివేంద్రానికి అవసరమైన మజ్జిగను అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాల్సిందిగా కోరారు.

శక్తి యాప్‌పై అవగాహన


శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న పోలీసులు

పెందుర్తి: మహిళల రక్షణ కోసం ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్‌పై సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పోలీసులు విస్తృతంగా ప్రచారం చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యా సంస్థలు, కార్యాలయాల్లో మహిళలకు యాప్‌పై అవగాహన కలిగించారు. వారి సెల్‌ఫోన్‌లలో యాప్ డౌన్‌లోడ్ చేయించి దాన్ని వినియోగించే విధానాన్ని వివరించారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి


ఎంపీపీ స్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రసాద్ పట్నాయక్

సింహాచలం: అడవివరం ఆరోగ్యకేంద్రం, గోశాల లేఅవుట్‌లోని ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ పట్నాయక్ శుక్రవారం సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర పథకాలను వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 98వ వార్డు బీజేపీ అధ్యక్షుడు ఆర్.వర్మ, మాజీ అధ్యక్షుడు బి.ఎ.నాయుడు, అడవివరం ఆరోగ్యకేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్ రామిరెడ్డి, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం పూర్ణిమ, అంగన్‌వాడీ టీచర్ శివరంజని పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణంలో మృతదేహం



పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలోని ఓ స్క్రాప్ దుకాణంలో గుర్తు తెలియని మృతదేహాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించారు. హెచ్‌సీ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇక్కడి స్క్రాప్ దుకాణంలో సుమారు 60–70 వయసు కలిగిన వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వివరాలకు ఫోన్: 94407 96039, 99085 58866 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బహిరంగ ధూమపానం నిందితులకు జరిమానా

పెందుర్తి: ఇటీవల కాలంలో పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేస్తున్న వారిపై మొత్తం 43 కేసులు నమోదు చేయగా.. వారికి రూ.8,600 జరిమానా విధించినట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఆ నగదును జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ప్రభుత్వ ఖాతాకు జమచేసినట్లు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంతో పాటు ధూమపానం కూడా నిషేధమని చెప్పారు. అలాంటి ఘటనలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

పరవాడ మండలం కలపాక శివారు మూలస్వయంభూవరం.. చుట్టూ పచ్చని పంట పొలాలు, స్వచ్ఛమైన నీటితో నిండిన చెరువులు, ఆహ్లాదకర వాతావరణంతో కళకళలాడేది. పాతికేళ్ల క్రితం ఏర్పాటైన సింహాద్రి ఎన్టీపీసీ విద్యుత్ ప్లాంట్‌తో గ్రామం కళా విహీనంగా మారిపోయింది. ప్లాంట్ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో పచ్చని పంట పొలాలు బీడువారిపోయాయి. స్వచ్ఛమైన గాలి, తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క దుర్భర జీవనం సాగిస్తున్నారు.


ఎన్టీపీసీ కాలుష్యంలో చిక్కుకున్న మూలస్వయంభూవరం

కాలుష్యం.. సమస్యలతో సావాసం


దప్పిక తీర్చలేని మంచినీటి పథకం

- ఎన్టీపీసీ కాలుష్యంలో మూలస్వయంభూవరం
- చుక్క నీరివ్వని రక్షిత మంచినీటి పథకం
- చేతి పంపులు కలుషితంతో ఇబ్బందులు
- ఉప్పు గాలికి తుప్పుపడుతున్న విద్యుత్ సామగ్రి


కలుషిత బోరు వద్ద దుస్తులు ఉతుకుతున్న మహిళలు


ఉప్పు గాలికి తుప్పు పడుతున్న విద్యుత్ సామగ్రి

వీధి దీపాలు లేని విద్యుత్ స్తంభాలు

తుప్పుపట్టిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పరవాడ: మూలస్వయంభూవరం గ్రామంలో నివసిస్తున్న ప్రజలు కనీస వసతులకూ నోచుకోక ఇబ్బంది పడుతున్నారు. ఏళ్ల తరబడి అనేక సమస్యలతో సతమతమవుతున్న తమను ఆదుకునే నాథుడే కనిపించట్లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ), రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు గ్రామంలో పర్యటించారు. సమస్యలపై అధ్యయనం చేసి, మెరుగైన వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. రోజులు గడుస్తున్నా.. తమ బతుకుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావట్లేదని ప్రజలు వాపోతున్నారు.

అమలుకు నోచుకోని ఎమ్మెల్యే హామీ

కాలుష్యంలో చిక్కుకున్న గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలిస్తామని ఎన్నికల ముందు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. ఎన్టీపీసీ చిమ్నీ, కూలింగ్ టవర్ల నుంచి ఎగసి పడుతున్న కాలుష్యం, ఉప్పునీటి తుంపర్లతో గ్రామంలో నివాస గృహాలన్నీ బీటలు వారి కూలిపోయే స్థితికి చేరాయి. గ్రామ సమీపం నుంచి ప్రవహిస్తున్న ఉప్పునీటి కాలువతో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. గొంతు తడుపుకోవడానికి గుక్కెడు నీళ్లు దొరక్క మండు వేసవిలో ప్రజలు అల్లాడిపోతున్నారు. గ్రామంలో నాలుగు చేతి పంపులున్నా.. ఒక చేతి పంపు నుంచే నీరు వస్తుంది. ఆ నీరు కూడా తాగేందుకు పనికిరాదు. కేవలం దుస్తులు ఉతికేందుకు, స్నానానికి వినియోగిస్తున్నారు. మిగిలిన బోర్ల నుంచి కలుషిత నీరు వస్తుండడంతో వాటిని ప్రజలు ఉపయోగించడం మానేశారు. మంచినీటి అవసరాల కోసం సమీపాన గల బొబ్బిలిలో ఏర్పాటు చేసిన బోరు నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. ఇవి ఎందుకూ సరిపోవట్లేదు. భూగర్భ జలాలు ఇంకిపోయి ప్రజలకు అవసరమైన తాగునీరందక నాలుగు కిలోమీటర్ల దూరాన ఉన్న వెన్నలపాలెం, పరవాడ ప్రాంతాల్లోని ఆర్వో ప్లాంట్లపై ఆధారపడుతున్నారు. డబ్బులకు వాటర్ క్యాన్లు కొనుగోలు చేసుకుని, తాగునీటి అవసరాలు తీర్చుకుంటున్నారు.

విద్యుత్ కష్టాలు వర్ణనాతీతం

ఎన్టీపీసీ నుంచి ఎగసి పడుతున్న ఉప్పునీటి తుంపర్లతో విద్యుత్ స్తంభాలకు అమర్చిన పరికరాలు, వైర్లు తుప్పుపట్టి ఎక్కడికక్కడ తెగిపోయి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఏళ్ల తరబడి గ్రామంలో వీధి దీపాలు వెలగడం మానేశాయి. చీకటి పడితే ప్రజలు ఇళ్లు దాటి బయటకు రాలేని పరిస్థితి. ఉప్పు గాలికి విద్యుత్ పరికరాలు తుప్పు పట్టి పాడవుతున్నా.. సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటి సరఫరాతో పాటు విద్యుత్ పరమైన సమస్యలు తీర్చడానికి చర్యలు తీసుకుంటామని అధికారులిచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదని ప్రజలు వాపోతున్నారు. ఎన్టీపీసీ ప్లాంట్ విడుదల చేస్తున్న కాలుష్యంతో తీవ్రంగా నష్టపోతున్న తమను ఆదుకునేందుకు ఆ సంస్థ కనీస చర్యలు చేపట్టల్లేదని ఆక్షేపిస్తున్నారు. గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించి, తమను ఆదుకోవాలని మొరపెట్టుకుంటున్నారు.

తాగునీటికి ఇక్కట్లు



ఎండలు మండుతున్నాయి. తాగునీరు అందక గొంతెండిపోతోంది. మంచినీటి పథకం నుంచి తగినంత తాగునీరు సరఫరా కావట్లేదు. దూర ప్రాంతాలకు వెళ్లి 20 లీటర్ల క్యాన్లను కొనుక్కుని తెచ్చి, దప్పిక తీర్చుకుంటున్నాం. గ్రామంలో నాలుగు బోర్లలో ఒకటే పనిచేస్తోంది. ఆ నీరు కూడా తాగేందుకు పనికిరాదు. బట్టలుతికేందుకు, స్నానపానాదులకు మాత్రమే వాడుతున్నాం. తాగు నీరందిస్తామన్న అధికారుల హామీ నిలబెట్టుకోవాలి.

– కాళ్లపురెడ్డి రాము, గృహిణి

కరెంటు వైర్లతో భయం భయం



తుప్పు పట్టిన విద్యుత్ వైర్లు ఎప్పుడు తెగిపడతాయోనని భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నాం. విద్యుత్ స్తంభాలపై ఇనుప కమ్మీలు తుప్పు పట్టి తరచూ రాలిపోతున్నాయి. దీంతో రోడ్లపై నడిచేందుకు భయపడే పరిస్థితి. వీధి దీపాలు వెలగడం లేదు. చీకటి పడితే ఇల్లు దాటి బయటకు రాలేకపోతున్నాం. వేళాపాలా లేని విద్యుత్ కోతలతో ఇబ్బంది పడుతున్నాం. తుప్పు పట్టిన విద్యుత్ వైర్లను తొలగించి కొత్త వైర్లను ఏర్పాటు చేయాలి.

– మోటూరి లక్ష్మి, గృహిణి

గ్రామాన్ని తరలించండి



ఎన్టీపీసీ కాలుష్యంలో మగ్గిపోతున్నాం. ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. ఇళ్లు పాడవుతున్నాయి. భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. పంటలు పండట్లేదు. తాగడానికి మంచినీరు దొరకట్లేదు. విద్యుత్ సమస్యలతో అవస్థలు పడుతున్నాం. గ్రామంలో మౌలిక సదుపాయల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కాలుష్యంలో చిక్కుకున్న గ్రామ తరలింపు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేస్తారని ఆశిస్తున్నాం.

– కొత్తపల్లి బాబూరావు, స్థానికుడు

పైడిమాంబ పండగ పోస్టర్ ఆవిష్కరణ


పండగ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న గ్రామ పెద్దలు

పరవాడ: పెదముషిడివాడ గ్రామంలో కొలువుదీరిన శ్రీ పైడిమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలను ఈ నెల 14, 15 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లా అప్పారావు తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పండగ వాల్‌పోస్టర్‌ను గ్రామ పెద్దలతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. సోమవారం అమ్మవారి తొలేళ్ల సంబరం సందర్భంగా పులివేషాలు, తప్పెటగుళ్లు, సాముగరిడీలు, సేవగరిడీ, నేలవేషాలు, మేదర బండి, పూసల డ్యాన్సులు, బండ్ల వేషాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనుపు మహోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మధ్యాహ్నం జిల్లా స్థాయి గుర్రపు స్వారీ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో గ్రామ పెద్దలు కన్నూరు ఎంపీటీసీ జి.శ్రీనివాసరావు, కమిటీ ప్రతినిధులు బలిరెడ్డి అప్పారావు, యలమర్తి బుజ్జి, కలవలపల్లి సత్యనారాయణ, బి.అప్పారావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘ ప్రతినిధులు

పరవాడ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణం, అంబేడ్కర్, మహాత్మ జ్యోతిబాపూలే, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు మండల కేంద్రం పరవాడలో స్థలం మంజూరు చేయాలని మండల ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు శుక్రవారం వినతిపత్రం అందించారు. మండలంలో ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు ఎన్టీపీసీ, ఫార్మాసిటీ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని, దళిత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని విన్నవించారు. దళితులకు కేటాయించిన భూములను వారికి చెందేలా చర్యలు తీసుకోవాలని, దళితుల భూముల్ని 22ఎ నుంచి తొలగించి న్యాయం చేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.డి.రాజు, ప్రతినిధులు ఈరుగుల లక్ష్మీప్రసాద్, ఎస్.నరసింగరావు, కె.చినసోమేశ్వరరావు, సోమరాజు, ప్రేమ కుమార్, నూకరాజు ఉన్నారు.

వైభవంగా అయ్యప్ప జన్మదినోత్సవం

- కన్నుల పండువగా అరాట్టు వేడుక
- సుజాతనగర్ అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు


అయ్యప్పస్వామికి చక్రస్నానం


అయ్యప్పకు అభిషేకాలు

పెందుర్తి: అయ్యప్పస్వామి జన్మదినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కళ సమేత శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో అరాట్టు వేడుకను ఘనంగా జరిపారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, గణపతి హోమం జరిగింది. అనంతరం ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి గురుస్వామి చేతుల మీదుగా స్వామికి షోడచోపచార పూజలు, నవద్రవ్యాలతో అభిషేక క్రతువు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో మణికంఠకు విశేష అలంకరణ చేసి అష్టోత్తర పూజలు జరిపారు. ఏక హారతి, పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆరాట్టు ఉత్సవంలో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి చక్రస్నానం చేయించారు. శబరిమలై తరహాలో ఉత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. మధ్యాహ్నం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. అయ్యప్పసేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి, రాధమల్లిక చేతుల మీదుగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. సాయంత్రం అయ్యప్ప గాన లహరి కార్యక్రమంలో అయ్యప్ప భక్తి గీతాలతో భక్తులు ఆధ్యాత్మిక చింతనలో మునిగారు. స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు అయ్యప్పను దర్శించుకున్నారు.

సాయిదుర్గా పీఠం ఆధ్వర్యంలో..

సబ్బవరం: స్థానిక మూడు రోడ్ల కూడలి హనుమాన్ జంక్షన్ వద్ద అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాయిదుర్గా పీఠం ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు, లాయర్ బేతిన శ్రీనివాస్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసాద వితరణ, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు గెడ్డం సూరిబాబు, కట్టార్, ద్వారంపూడి శ్రీను, చిత్రాడ శ్రీను, పెన్నం సతీష్, పెన్నం రామకృష్ణ, అడపా గణేష్ తదితరులు పాల్గొన్నారు.


పేదలకు చీరలు అందిస్తున్న ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు


హనుమాన్ జంక్షన్ వద్ద భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న కర్రిబాబు తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. దేశపాత్రునిపాలెం, సాయినగర్ కాలనీ, జాజులవానిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే పంచకర్ల శుక్రవారం పర్యటించారు. మహాత్మ జ్యోతి బాపూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన ప్రజా దర్బారులో సమస్యలపై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూడిద, బొగ్గు లారీల కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. బూడిద లారీల కోసం ఎన్టీపీసీ రైల్వే ట్రాక్ అనుసంధానంగా అదనపు రోడ్డు ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. లంకెలపాలెం వంతెన వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి స్థల పరిశీలన జరిపారు. ఆయన వెంట కూటమి నాయకులు దుల్ల రామునాయుడు, పిల్లా శివకృష్ణ, బుగిడి రామగోవిందరావు, మోటూరి సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాసరావు, సుందరపు శ్రీనివాస్, వియ్యపు చిన్న, బొండా అప్పారావు, బలిరెడ్డి అప్పారావు, కరణం నరసింగరావు పాల్గొన్నారు.

అక్రమంగా చెట్ల నరికివేతపై రగడ

- కూటమి నేతల అండతో సాగునీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల దందా
- ఆయకట్టు రైతులు, గ్రామస్తులతో కలిసి అడ్డుకున్న పంచాయతీ సభ్యులు
- నరికిన చెట్ల విలువ రూ.20 లక్షలు?


సూరపురాజు చెరువులో నరికేసిన నేరేడు చెట్లు


చెట్ల నరికివేతను అడ్డుకున్న రైతులు, సాగునీటి సంఘం, పంచాయతీ సభ్యులు

సబ్బవరం: మండలంలోని గొటివాడ రెవెన్యూ పరిధి సూరపురాజు చెరువులో పెద్దఎత్తున నేరేడు, యూకలిప్టస్ చెట్లను నరికి అక్రమంగా తరలించుకుపోతున్నారు. రెండు వారాలుగా జరుగుతున్న ఈ వ్యవహారాన్ని గుర్తించిన గ్రామస్తులు, ఆయకట్టు రైతులతో కలిసి సాగు నీటి సంఘం, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు శుక్రవారం అడ్డుకున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గొటివాడ రెవెన్యూ పరిధి సర్వే నెం.16లో 42.32 ఎకరాల సూరపురాజు చెరువు ఉంది. ఈ చెరువుకు గొటివాడ గ్రామంతో పాటు శివారు గ్రామాలైన బొండవానిపాలెం, సాలాపువానిపాలేనికి చెందిన 100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. మండలంలోనే రెండో అతిపెద్ద చెరువు. దీని చుట్టూ 30 ఏళ్ల వయసు పైబడిన భారీ నేరేడు చెట్లు, సుమారు 6 ఎకరాల వరకూ యూకలిప్టస్ తోట ఉంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. కూటమికి చెందిన సాగునీటి సంఘం అధ్యక్షుడు సాలాపు సూరిబాబు, ఉపాధ్యక్షుడు బొండా శివరాం మిగిలిన పాలకవర్గ సభ్యులకు గాని, గ్రామ పంచాయతీ పాలకవర్గానికి సమచారం ఇవ్వకుండా చెట్లను నరికి, రూ.లక్షల్లో సొమ్ము చేసుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెండు వారాలుగా ఎప్పుడు నరికిన చెట్లను అప్పుడే తరలించుకుపోతున్నారని పేర్కొన్నారు. దీంతో శుక్రవారం చెట్లు నరుకుతుండగా మాజీ ఎంపీటీసీ బొండా కళ్యాణ్‌రాజ్, ఉప సర్పంచ్ గొలజాన దుర్గాప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ విరోతి రామారావు, నీటి సంఘం డైరెక్టర్లు లగిశెట్టి సోమునాయుడు, లగిశెట్టి బంగారయ్య, లగిశెట్టి కూమార్, విరోతి అచ్చెంనాయుడు, విరోతి రామ్మూర్తి, లగిశెట్టి పెద అప్పారావు, విరోతి అప్పారావు తదితరులు ఆయకట్టు రైతులతో కలిసి అడ్డుకున్నారు. సుమారు 45 వరకూ నేరేడు చెట్లు, 6 ఎకరాల్లో యూకలిప్టస్ తోటను నరికి అప్పటికే తరలించుకుపోయినట్లు మీడియాకు తెలిపారు. తరలించుకుపోయిన చెట్ల విలువ రూ.20 లక్షల వరకూ ఉంటుందన్నారు. దీనిపై ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశామని, తహసీల్దార్‌తోపాటు జిల్లా కలెక్టర్‌కూ ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదు అందుకున్న ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ ఘటనా స్థలానికి వచ్చి నరికేసిన చెట్లను పరిశీలించారు. వివరాలు సేకరించారు.

దీనిపై సాగునీటి సంఘం చైర్మన్ సాలాపు సూరిబాబును వివరణ కోరగా 2016లోనే చెట్లను నరికివేసేందుకు ఆక్షన్‌వేసి రూ.2.50 లక్షలు ఇరిగేషన్ శాఖకు చలానా జమ చేసినట్లు తెలిపారు. అప్పట్లో ప్రస్తుత సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు బొండా శివరాం అడ్డుకుని కేసు వేయడంతో చెట్లు తీయడం జరగలేదన్నారు. సంవత్సరం క్రితం కోర్టులో కేసు డిస్మిస్ కావడంతో ప్రస్తుతం చెట్లు తీస్తున్నట్లు పేర్కొన్నారు.

పాలిసెట్ స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: పాలిసెట్–2025 అభ్యర్థులకు సాంకేతిక విద్యాశాఖ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్.ఎస్ చంద్రశేఖర్ చేతుల మీదుగా శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొత్తం 135 మందికి ఉచితంగా మెటీరియల్ అందించామన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ సిద్ధం చేసిన స్టడీ మెటీరియల్ పూర్తిగా అభ్యసిస్తే మంచి ర్యాంకు సాధించడం తథ్యమన్నారు. విద్యార్థులు ఈ తక్కువ సమయంలోనే ఎక్కువ కృషి చేసి, ఉత్తమ ర్యాంకులు సాధించాలని అభిలషించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 15 మందికి కోర్టు రూ.1.50 లక్షలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ నరసింగరాజు తెలిపారు. శుక్రవారం వీరిని 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.